


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -152-

**(20 జూన్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

"**గాలి, నీరూ** ఈ రెండింటితో జీవించడం ప్రజలకు అలవాటైన తర్వాత పంట భూములు క్రమంగా అదృశ్యమైపోతాయి. ఆహారానికి సంబంధించిన పంటలు ఏం వుంటాయి ఎక్కువగా" అన్నాను మా మిత్రునితో.

" లేకేమండి జనపనార వగైరాలు." అన్నాడు.

"అప్పుడు మాత్రం ఏమంత ఎక్కువ ఉపయోగం ఉంటుందండి? ఏదో సిమ్మెంటు సంచులు వగైరాలకు ఉపయోగించవచ్చు. నాటకాల్లో, సినిమాల్లో ఉపయోగించే పెట్టుడు గడ్డాలకు కొంతవరకు అవసరం కావచ్చు" అన్నాను.

"ఏమైనప్పటికీ జనపనార, ఆముదాలు, పొగాకు, పత్తి యిత్యాదులు ఏ కొద్దిలో పంటలో మిగులుతాయి. తక్కిన మాగాణి అంతా ఖాళీ. ఎంతో విశాల ప్రపంచం ఏర్పడుతుంది.

అయితే, అలాటి ప్రాంతాలలో మధ్య మధ్య చిన్న చిన్న గాలి బంగళాలు, కుటీరాలు, గుడారాలు ఎక్కువ ఏర్పడతాయి. పట్టణాల్లో ఇళ్ళంటూ వున్నా, బహుశా అక్కడ జనం ఎక్కువగా వుండరు. గాలి బ్రతుకులకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చి పరుగులు తీస్తూ వుంటారు" అన్నాడాయనగారు.

ఆయన చెపుతుంటే ఏదో ఒక మనోహర దృశ్యం కళ్ళకు కట్టినట్లు అయింది. అలాటి కాలమే వస్తే ఎంత విచిత్రంగా వుంటాయి పరిసరాలూ, ప్రజా హృదయాలూ అనిపించింది.

"నిజమేనండీ అసలు ప్రజల భావనలే మారిపోతాయండీ. పౌరసత్వం కథలు కూడా మారిపోయినా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు" అన్నాడాయన.

"కవిత్వంలో మార్పు ఎలా వుంటుందంటాను" అన్నాను.

ఆయనగారికి ఎక్కడలేని ధీమా ఏర్పడింది.

"కవిత్వానికేం? ధీమాగా వుంటుంది.

మైదానంలో నీకో

గుడారమేస్తా...

మన్మధ బాణం

క్షణంలో విరిచేస్తా.

కదలాలి కాలచక్రాలే

గిరగిర తిప్పేస్తా.."

ఇలాటి కవిత్వాలు చాలా ప్రచారంలోకి రావచ్చు. అసలు సారస్వత స్వభావమే మారిపోతుంది. సంసార ఘట్టం కోపంతో సంబంధించిన ఘట్టాలు వగైరాలు ఏమీ వుండవు. అన్నం వండుకోవడం, తినడం వగైరా కార్యక్రమాలేమీ వుండవు కనుక. ఆ బాధ్యత నుంచి విముక్తి చెందిన ప్రాణులు రికామీగా తిరుగుతూ వుండటం వల్ల ప్రణయం పదిరెట్లు పెరిగే అవకాశం వుండవచ్చు" అన్నాడాయన.

"అయితే, వాటికి ఎక్కువగా ప్రచారం కూడా ఏర్పడుతుందంటారా" అని ప్రశ్న.

"ఏమి ప్రశ్న అండీ అది. ఇప్పటికే ఎక్కువగా వుందా శాఖకు చెందిన ప్రచారం.

మరి మనమనుకుంటున్న కాలం వస్తే ప్రచారానికేం లోటు. పత్రికలలో ఆహార సమస్యకి చెందిన ప్రణాళికలు వగైరాలు మృగ్యమవుతాయి. పరువు తీసేస్తున్న చీకటి బజారులు నశించిపోతాయి. ఎరువులకు గోడౌనులుండవు. 'ధాన్యం దోసిళ్ళు' వుండవు. కనుక వీటి తాలూకు చోటంతా వృధాగా వుంటుంది గనుక ఆ విస్తీర్ణమంతా ప్రణయ వృత్తాంతాల క్రింద వినియోగించుకోవచ్చు" అన్నారాయన.

తర్వాత ఒకామెతో మాట్లాడుతూ "స్త్రీలకు వంట పనులు లేకుండా పోతే ఎలా మారతారంటారు" అని ప్రశ్నించాను.

"మారకేమండీ. వంట పని లేకపోతే ఎడ్లని మెత్తటి గరికి బీడులోకి వదిలినంత స్వేచ్ఛ వస్తుంది. అసలలాంటి అవకాశమే వస్తే చేతికి అందనంత ఎత్తు పెరిగిపోతారు. మగవాళ్ళను చిత్తు చిత్తు చేసి పారేస్తారు.

ఈ వంటల మూలంగా కాదుటయ్యా ఆడవాళ్ళ రూపు రేఖా విలాసాలు పోగొట్టుకుని, ఉప్పు తొట్టలై పోతున్నారు? తెల్లారి లేచినప్పటినుంచి కుంపటి ముందేనాయే. శరీరాలు అరక్కాగి, మనస్సులు మరక్కాగిపోతున్నారు.

"మెళ్ళో గుదిబండ పడ్డప్పుడు వాత పట్టిన పచ్చడిబండ, రెండు పూటలా వెంటబడి తరుముతూనే వుంటుందాయె. జబ్బలు అరిగిపోయినా, కండలు తరిగిపోయినా, గుండెలు కరిగిపోయినా దానికి జాలి వుండదు. పై నుంచి చూసే భర్తకూ జాలి వుండదు.

అలాటిది జలభక్షణ, వాయు భక్షణలు అమలులోకి వస్తే ఆడవాళ్ళంతా రోళ్ళను, బండల్ని గరిటెల్ని కుంపట్లనీ, దొర్లించుకుని ఒక్కసారిగా సముద్రంలోకి తోసి నవ్వుతూ చక్కారారూ తమ తమ ఇళ్ళకు" అన్నదామె ధీమా స్థోమతూ ప్రకటిస్తూ.

నిజానికి ఈ వంటల వ్యాసాంగం మీద ఎంతకాలం వృధా అవుతోంది. ఎన్ని అవమానాలు, బాధలు పడవలసి వస్తోంది? అన్నిటినీ మించి ఎంత అసమానత్వం వర్ధిల్లుతోంది. దేశంలోకి ఈ క్రొత్త పద్ధతివల్ల అంతులేని బాధలు తప్పి పోతాయి. ఒకడి దగ్గర ఒకడు ఊడిగం చెయ్యడమనే అవస్థ తప్పిపోతుంది.

అన్నిటినీ మించి కుటుంబ నియంత్రణ గందరగోళం నశించిపోతుంది. గాలి తిని బ్రతికేవాడికి ఎవరు ఎందర్ని కంటే ఎవడిక్కావాలి. పోనుపోను కొంతకాలానికి గాలి చాలడం లేదని, నీరు చాలడంలేదని అప్పటి ప్రభుత్వాలు గగ్గోలు పడితే పడవచ్చు.

మా మిత్రుడొకాయన కుటుంబ నియంత్రణ నియమిత సంతానానికి 'సరస' సంతానమనీ, అంతకు మించిన సంతానానికి 'రభస' సంతానమనీ పేర్లు పెట్టారు. పైన చెప్పిన పద్ధతి అమలులోకి వచ్చిన తర్వాత సరస సంతానాల వ్యామోహం వుండదు. నలభై కోట్లను నాలుగుపెట్టి హెచ్చవేసినా అడిగేవాడు ఉండడు.

గాలి తిని జీవించేవారందర్నీ "వాయు సంతానం" అని పేర్కొంటే పేర్కొనవచ్చును. ఇప్పుడు ఇంటి యజమాని, వాడి యజమాని, దుకాణదారుడు, అప్పిచ్చేవాడు, డాక్టరు అనే ఈ పంచభూతాల చేత జీవులు రక్షించబడుతున్నారు. అప్పుడు జీవులు వీరందరి నుంచి విముక్తులై అసలు పంచభూతాల చేత పరిరక్షింపబడే మహాభాగ్యాన్నందుకోగలుగుతారు. వారంతా దీర్ఘాయుష్మంతులవుతారేమో? ఎలా చెప్పడం?

పంటలు వుండవు. పలహారాలుండవు. అని విన్నప్పుడు మాత్రం ఒకరిద్దరు ఎంతో బాధపడ్డారు. ఒకాయన "అన్నం మానుకుంటే పర్వాలేదు. గారెలు మానుకోవడమెలా? మినుముల పంట ఒక్కటివున్నా బాగుండును" అని విచార పడ్డాడు.

"మినుములుంటే  నువ్వులుండొద్దుటయా? నీదంతా మిడిమేలపు మేళాం" అని ప్రక్కనున్న అయన చివాట్లు పెట్టాడు.

పరమాన్నం మీద ప్రీతిగల ఒక వ్యక్తి "సగ్గుబియ్యం వుంటాయా?" అని ప్రశ్నిస్తే, అలంకారం మీద అభిలాష గల ఒక యువతి "మల్లెమొగ్గలుంటాయా"అని అడిగింది.

ఎంతో ఆశతో వృద్ధాప్యంలో పడ్డ పెద్ద మనిషి "అన్నీ పోతే పోయాయి దగ కాయలు (కరక్కాయలు వుంటాయో వుండవో) అనే సంశయావస్థలో పడ్డాడు.

ఈ గాలిమేలితనం అమలులోకి వస్తే అనేక ఆచారాలూ, అలవాట్లూ వాటివెంట వుండే చివాట్లు ఎన్నో తప్పిపోతాయి.

Post your comments